అద్దింట్లో అంగన్‌వాడీ కేంద్రాలు

- అవస్థల్లో విద్యార్థులు, అంగన్‌వాడీలు


పసునూర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు


నాగారంలో అద్దె భవనంలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

నాగారం : అంగన్‌వాడీ కేంద్రాలు అద్దెభవనాల్లో కూనరిల్లుతున్నాయి. ఏళ్లుగడుస్తున్నా సొంతభవనాలకు నోచుకోవడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించకపోవడంతో...అద్దె భవనాల్లో సరైన వసతులు లేకపోవడం.. వెరసి చిన్నారులు, సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. మండలంలో పలుచోట్ల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం పక్కా భవనాలు నిర్మించేందుకు గతంలో నిధులను మంజూరి చేసింది. కానీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో ఏళ్లు గడిచినా సకాలంలో పనులు ముందుకు సాగడంలేదు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. మండలంలో 29 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, వీటి పరిధిలో గర్భిణులు 144 మంది, బాలింతలు 139, ఆరు నెలల నుంచి 3ఏళ్ల చిన్నారులు 679, 3 ఏళ్ల నుంచి 6ఏళ్ల పిల్లలు 442 మంది ఉన్నారు. మండలంలోని 29 అంగన్‌వాడీ కేంద్రాల్లో 16 రెంట్‌ఫ్రీ భవనాలు ఉండగా, మరో 12 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కేవలం ఒక డి.కొత్తపల్లిలో మాత్రమే అంగన్‌వాడీ పక్కా భవనం ఉంది. అద్దె భవనాల్లో సరైన మౌళిక వసతులు లేకపోవడంతో అంగన్‌వాడీ పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మండలంలోని పసునూర్, పస్తాల గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కాభవనాల ఏర్పాటు కొరకు ఒక్కొక్క దానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధుల నుంచి రూ.6.50లక్షల చొప్పున నిధులు కేటాయించారు. పస్తాలలో అంగన్‌వాడీ భవన పనులు నిర్మాణ దశలో ఉండగా...పసునూర్‌లో కేవలం పిల్లర్ దశకే పరిమితమైంది. అయితే కాంట్రాక్టర్లు సకాలంలో పూనులు పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం నిధులు నిలిపివేసింది. దీంతో అంగన్‌వాడీ భవనాలు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి.

అరకొర వసతులతో అవస్థలు

తల్లీబిడ్డ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తు అంగన్‌వాడీ కేంద్రాలలో అరకొర వసతులతో లబ్దిదారులకు, నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా చోట్ల రేకుల షెడ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లే దిక్కవుతున్నాయి. అద్దె భవనాల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం సక్రమంగా లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి పక్కా భవనాలను కేటాయించి, మెరుగైన మౌళిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.


ఇబ్బందులు తప్పడం లేదు



అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అద్దె భనాల్లో సరైన వసతులు లేవు. అలాగే వర్షాలు కురిసినప్పుడు గర్భిణీ, బాలింతలకు, పిల్లలకు అందించే వస్తువులు తడిపోతున్నాయి. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు కేటాయించాలి.

– సుమిత్ర, అంగన్‌వాడీ టీచర్, నాగారంబంగ్లా

ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ



తిరుమలగిరి (తుంగతుర్తి) : తుంగతుర్తి శాసన సభ తుది ఘట్టమైన ఓట్ల లెక్కింపు ఆదివారం ఉదయం 8 గంటలకు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మార్కెట్ గోదాంలో ప్రారంభమవుతుంది. ఓట్లు లెక్కించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమై ఎవ్వరికి అధికారం కట్టబెడతాయోననే ఉత్కంఠ సర్వత్రా నెలకొన్నది.

87.64 శాతం పోలింగ్

తుంగతుర్తి నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2.55 లక్షల 17 మంది ఉండగా 2.23 లక్షల 496 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్ల లెక్కింపు కోసం 18 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. 326 పోలింగ్ కేంద్రాలకు 19రౌండ్లలో ఓట్ల లెక్కింపు పూర్తి కానున్నది. ఒక్కో రౌండ్ 20 నుంచి 30 నిమిషాల్లో లెక్కింపు పూర్తవుతుంది. ఇప్పటికే ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

పోస్టల్ బ్యాలెట్లతో మొదలు

ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్లతో లెక్కింపు ప్రారంభమై అర గంటలో ముగుస్తుంది. తొలుత పోస్టల్ బ్యాలెట్‌లో, తరువాత సర్వీస్ ఓట్లను లెక్కించాల్సి వస్తుంది. నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ల 1,730 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంబంధిత రిటర్నింగ్ అధికారి పర్యవేక్షణలోనే పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఈవీఎంలలోని ఓట్ల లెక్కింపు టేబుళ్లను అదనంగా పోస్టల్ బ్యాలెట్ల కోసం ఆర్‌వో వద్ద ప్రత్యేక టేబుల్‌ను ఏర్పాటు చేస్తారు.

వీవీ ఫ్యాట్ స్లిప్పులే ప్రామాణికం

కంట్రోల్ యూనిట్లపై ఉన్న అనుమానాలను తొలగించడానికి నియోజకవర్గంలోని 5పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన వీవీ ఫ్యాట్ స్లిప్పులను లెక్కించాల్సి ఉంటుంది. ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా వీవీ ప్యాడ్లను ఎంపిక చేస్తారు. కంట్రోల్ యూనిట్లకు సంబంధించి చివరి రౌండ్ పూర్తయ్యాకే వీవీ ఫ్యాడ్ల స్లిప్పులను లెక్కిస్తారు. అభ్యర్థుల గుర్తుల వారిగా పెట్టెలను ఏర్పాటు చేసి వారికి వచ్చిన ఓట్లను వాటిల్లో వేస్తారు. అనంతరం లెక్కిస్తారు. ఒకవేళ ఈవీఎం కంట్రోల్ యూనిట్, వీవీఫ్యాట్ స్లిప్పులకు తేడా వస్తే ఆ స్లిప్పులను మరోసారి లెక్కిస్తారు.

రౌండ్ల వారీగా..

పోస్టల్ బ్యాలెట్లతో సంబంధం లేకుండా ఉదయం 8.30 గంటలకు ఈవీఎం కంట్రోల్ యూనిట్లలో నిక్షిప్తమైన ఓట్లను లెక్కించడం ప్రారంభిస్తారు. ఒక్కో నియోజకవర్గానికి 18 టేబుళ్లను ఏర్పాటు చేస్తారు. పోలింగ్ కేంద్రాల క్రమ సంఖ్య ఆధారంగా ఒక్కో టేబుల్‌కు ఒక్కో కంట్రోల్ యూనిట్‌ను కేటాయిస్తారు. ఇలా 18 టేబుళ్లపై 14 కంట్రోల్ యూనిట్లను ఉంచి ఓట్లను లెక్కిస్తారు. టేబుళ్లపై ఉన్న కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల లెక్కింపు పూర్తయితే దానిని ఒక రౌండ్‌గా భావిస్తారు. ఈ ప్రక్రియ జరగడానికి సుమారు 20 నుండి 30 నిమిషాల సమయం పడుతుంది. అధికారులు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన కంట్రోల్ యూనిట్లలో ఓట్లను లెక్కించే వరకు రౌండ్ల వారిగా ఈ ప్రక్రియ కొనసాగుతుంది. కౌంటింగ్, అధికారులు, అభ్యర్థుల తరపున వచ్చిన ఏజెంట్ల సమక్షంలో ఈ తంతు జరుగుతుంది.

క్లుప్తంగా

పూర్వ విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 2004–2005 టెన్త్ బ్యాచ్ పూర్వవిద్యార్థిని కోమటిపల్లికి చెందిన నున్న గణిత తల్లి వెంకటమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గణిత కుటుంబానికి శనివారం రూ.9,500 ఆర్థిక సాయం తోటి విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బూర్గుల రాంబాబు, మామిడి రవి, బూర్గుల భాగ్యమ్మ, సూరారపు శ్రీను, ఎం. శ్రీను, కె. శ్రీను, ఉషశ్రీ, సరిత, శైలజ, రాజేష్, సుధాకర్, లింగయ్య, వీరాస్వామి, నాగేంద్రబాబు, నాగరాజు, సందీప్ రెడ్డి, భాగ్యమ్మ, కౌసర్‌భేగం, అలివేలు, విష్ణు, రమేష్, శ్రీను, ప్రవీన్, పరమేష్, యల్లయ్య, సతీష్, రేణుక, సంజయ్, మాధవి పాల్గొన్నారు.

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరిలోని ప్రాచీన శివాలయంలో అర్చకునిగా పని చేస్తున్న సాంబయ్య అనారోగ్యానికి గురయ్యాడు. సాంబయ్యకు శనివారం గ్రామానికి చెందిన నెమురుగొమ్ముల రాము రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో దుంపల కృష్ణారెడ్డి, శివస్వాములు నాతి వీరమల్లు, జక్కుల రమేష్, సారాజ్, వజీద్ తదితరులు పాల్గొన్నారు.

వెలిశాలలో అయ్యప్ప మహా పడిపూజ


వెలిశాలలో పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామంలో శనివారం అయ్యప్ప స్వాములు మహా పడి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాల దారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో గురు స్వాములు శ్రీనివాస్, చారి, మహేష్, వెంకన్న, యాదగిరి, నరేష్, లింగన్న పాల్గొన్నారు.

గెలిచినా.. ఓడినా ప్రజాపక్షమే

కోదాడఅర్బన్ : అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచినా.. ఓడినా ప్రజల పక్షమే ఉంటానని సీపీఎం కోదాడ ఎమ్మెల్యే అభ్యర్థి మట్టిపల్లి సైదులు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలోని సుందరయ్య భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నిల సందర్భంగా ప్రజలు నియోజకవర్గంలో తిష్టవేసిన అనేక సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేస్తానన్నారు. తన గెలుపు కోసం పనిచేసిన పార్టీ నాయకులకు కళాకారులకు, మీడియాకు, ఎన్నికల సందర్భంగా సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం రాబోయే ప్రజా తీర్పును గౌరవస్తానని, భవిష్యత్తులో ప్రజల మనసును గెలుచుకుంటానని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యుడు దేవరం వెంకటరెడ్డి, సీపీఎం పట్టణ కార్యదర్శి మిట్టగనుపుల ముత్యాలు, ప్రజాసంఘాల నాయకులు సైదా, స్వరాజ్యం పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

మునగాల : ప్రస్తుత సమాజంలో అన్ని రంగాల అభివృద్ధికి సాంకేతిక పరి/జ్ఞానం ఎంతో అవసరమని, అందుకోసం పాఠశాల తరగతి గదే ఒక ప్రయోగశాల కావాలని, ప్రతి విద్యార్థి సాంకేతిక పరి/జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మునగాల ఎస్‌ఐ పి.లోకేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సాయి గాయత్రి విద్యాలయంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ఫేయర్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి నూతన ఆవిష్కరణలతో శాస్త్ర సాంకేతిక పరి/జ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాల స్థాయిలో సైన్స్ ఫేయర్ నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఎండి.సలీమ్ షరీఫ్, ప్రిన్సిపాల్ అర్వపల్లి శంకర్, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ మృతి

తిరుమలగిరి (తుంగతుర్తి) : తిరుమలగిరి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాగెల్ల శ్రవణ్‌కుమార్ (52) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. శ్రవణ్‌కుమార్ మృతి పట్ల ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత, మండల పరిషత్ అధికారి ఉమేష్‌చారి, మండల పంచాయతీ అధికారి మారయ్య, కార్యాలయం సిబ్బంది రణధీర్‌రెడ్డి, శిల్పిక నివాళులర్పించారు.

హెల్త్‌కిట్లు ఇప్పుడైనా వచ్చేనా?

- మూడేళ్లుగా నిలిచిపోయిన హెల్త్‌కిట్ల సరఫరా
- విద్యార్థినులకు తప్పని ఎదురుచూపులు


హెల్త్‌కిట్‌లో ఉండే వస్తువులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థినుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందించే హెల్త్‌కిట్లు మూడేళ్లుగా రాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు. చివరగా 2019 డిసెంబర్‌లో విద్యార్థులకు హెల్త్‌కిట్లను అందజేశారు. తరువాత 2020 మార్చిలో కరోనా కారణంగా పాఠశాలలు మూతపడటంతో విద్యార్థులకు అందించే ఆరోగ్య పరిరక్షణ కిట్ల సరఫరా నిలిచిపోయింది. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా నేటికీ విద్యార్థులకు హెల్త్ కిట్లు రాకపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్కారు బడుల్లో చదివే విద్యార్థులు ఎక్కువ మంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారే ఉన్నారు. దీంతో వారికి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం 2018–19 విద్యా సంవత్సరం నుంచి 7వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థినులకు ఆరోగ్య పరిరక్షణ కిట్లను ప్రభుత్వం అందజేస్తుంది. ఈ హెల్త్‌కిట్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి విద్యార్థినులకు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ పంపిణీ ప్రక్రియలో జాప్యం జరుగుతుండటంతో విద్యార్థులకు ఎదురు చూపులు తప్పడం లేదు.

మూడేళ్లుగా అందని కిట్లు...

ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు మూడు నెలలకు ఒకసారి ఏడాదికి 4సార్లు(వేసవి సెలవుల్లోకూడా) జులై, అక్టోబర్, జనవరి, ఏప్రిల్ నెలల్లో హెల్త్‌కిట్లను పంపిణీ చేయాల్సి ఉంది. కానీ 2020 జనవరి నుంచి నేటి వరకు విద్యార్థులకు ఆరోగ్యపరిక్షణ కిట్లు అందలేదు. మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉండగా వీటి పరిధిలో ప్రాథమికోన్నత, ఆదర్శ పాఠశాల, కేజీబీవీ, ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారు 1,165 మంది బాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. గత ఏడాదిన్నరగా విద్యార్థులకు హెల్త్ కిట్లు రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కిట్లలో ఉండే వస్తువులు ఇవే..

ప్రభుత్వం బాలికల యొక్క ఆరోగ్య సంరక్షణకు అందించే హెల్త్‌కిట్లలో 11 రకాలైన వస్తువులను పంపిణీ చేస్తుంది. వీటిలో పతాంజలి, డాబర్, జాన్సన్ అండ్ జాన్సన్, ఐటెక్స్ వంటి కంపెనీలకు చెందిన బ్రాండెడ్ వస్తువులు, మూడు ఒంటి సబ్బులు, మూడు బట్టల సబ్బులు, ఒక టూత్ బ్రష్, కొబ్బరినూనే బాటిల్, షాంపు బాటిల్, టూత్‌పేస్ట్, శానిటరీ న్యాప్కిన్స్, పౌడర్‌డబ్బా, బొట్టుబిళ్లలు, ఒక దువ్వెన, రెండు రబ్బర్లు, రెండు రిబ్బన్లను పొందుపర్చి హెల్త్‌కిట్ ద్వారా బాలికలకు అందిస్తారు.

ఇబ్బందులు పడుతున్నాం



ప్రభుత్వం అందించే ఆరోగ్య పరిరక్షణ కిట్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఆరోగ్య పరిరక్షణ కిట్లు మూడు నెలలకు ఒక సారి పంపిణీ చేయాల్సి ఉండగా మూడేళ్లుగా నుంచి పంపిణీ చేయడంలేదు.

– ఎస్.కె.అస్లాతబసుం, విద్యార్థిని, మోడల్‌స్కూల్ పసునూర్

హెల్త్‌కిట్లు రాగానే పంపిణీ చేస్తాం



విద్యార్థులకు అందించే ఆరోగ్య పరిరక్షణ కిట్లు ప్రభుత్వం నుంచి మంజూరి కాలేదు. హెల్త్ కిట్లు మూడేళ్లుగా పాఠశాలలకు రావడంలేదు. ఈ విద్యా సంవత్సరం హెల్త్‌కిట్లు మంజూరైతే విద్యార్థులకు అందజేస్తాము.

– బి.బాలునాయక్, ఎంఈవో, నాగారం

సాక్షి స్పెల్ బీలో ‘జయ’ విద్యార్థుల ప్రతిభ




వివిధ కేటగిరీలలో ప్రతిభ కనబరిచిన జయ పాఠశాల విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : సాక్షి మీడియా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన సాక్షి స్పెల్ బీ 2023 పోటీలో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జయ ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. కేటగిరీ 3లో 48 మంది విద్యార్థులు, కేటగిరీలో 4లో 16 మంది విద్యార్థులు రెండవ లెవల్‌కు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ తెలిపారు. ఒలింపియాడ్ ప్రోగ్రామ్‌తో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో పదాలు, గ్రామర్ పట్టు సాధించడం ద్వారా స్పెల్ బి పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. పోటీ పరీక్షలకు స్పెల్ బీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్‌తో పాటు డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి అభినందించారు.

ఎన్నికల్లో కార్యకర్తల కృషి అభినందనీయం


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వరరావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ఎన్నికల్లో బీజేపీ కార్యకర్తల కృషి అభినందనీయమని ఆ పార్టీ సూర్యాపేట అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు అన్నారు. బీజేపీ గెలుపును కాంక్షిస్తూ ఎన్నికల్లో పని చేసిన ప్రతి కార్యకర్తకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సూర్యాపేట పట్టణంలోని బాలాజీ గార్డెన్‌లో శనివారం నియోజకవర్గ ఎన్నికల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ కార్యకర్తలు సరిహద్దుల్లో దేశం కోసం యుద్ధం చేసే సైనికుల్లా పని చేశారన్నారు. జనసేన, ఎమ్మార్పీఎస్ బలపర్చడం, బీసీ ముఖ్యమంత్రి ప్రకటించడం కలిసొచ్చిందన్నారు. నరేంద్రమోదీ మీద ఉన్న విశ్వాసం,బీజేపీకి ఓటు బ్యాంకు పెరిగిందన్నారు. గతంలో దామోదర్ రెడ్డి, జగదీశ్‌రెడ్డి పాలనను వ్యాపార వర్గాలు చూశారని, ఈసారి సంకినేనిని గెలిపించాలని వ్యాపార వర్గాలు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేయడానికి అధికార పార్టీ అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసిందని, బీజేపీ కార్యకర్తల సహకారంతోనే పోల్ మేనేజ్మెంట్‌తో పక్కాగా పని చేశామన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం


దామోదర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రజనీకుమారి

భానుపురి (సూర్యాపేట) : దేశంలో,రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి రజనీకుమారి అన్నారు . శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి, సూర్యాపేట కాంగ్రెస్ అభ్యర్థి రామిరెడ్డి దామోదర్ రెడ్డిని మర్యాదపూర్వంకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ లో ఉండి సేవ చేసేందుకు గత నెల 18న టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో తాను చేరడం జరిగిందని తెలిపారు .దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గెలుపు పవనాలు వీస్తున్నాయని తెలిపారు. బడుగు బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమని తెలిపారు. బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. సూర్యాపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి గెలవడం ఖాయమన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కంచుకోటని మరోమారు రుజువు కాబోతుంది అన్నారు.

పూర్తి కావస్తున్న ధాన్యం కొనుగోళ్లు


రామన్నగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశులు


సూర్యాపేట–జనగామ హైవేపై వేల్పుచర్ల వద్ద రైతులు పోసిన ఆరబోసిన ధాన్యం రాశులు

అర్వపల్లి: వానాకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి కావస్తుంది. మండల వ్యాప్తంగా మరో వారం రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తవుతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. జాజిరెడ్డిగూడెం మండలంలో ఈ సీజన్‌కు గాను 20 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 4.50లక్షల బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఇంకా సుమారు 1.50 లక్షల బస్తాల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే వాతావారణం మార్పుల మూలంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ సూచిస్తుండటంతో ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేయాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు.


యాసంగి సాగుకు సన్నద్ధం

- నారుమడులు సిద్ధం చేసుకుంటున్న రైతులు
- డ్రమ్ సీడ్ పద్ధతిలో సాగుకు పొలాల్లో దమ్ము

ఆత్మకూరు (ఎస్)(సూర్యాపేట) : మండల వ్యాప్తంగా యాసంగి సాగుకు రైతాంగం సన్నద్ధం అవుతుంది. వానకాలం పంటల అమ్మకాలు కొన్నిచోట్ల పూర్తి కాగా మరికొన్నిచోట్ల చివరి దశకు వచ్చాయి. డిసెంబర్ ప్రారంభం కావడంతో నారుమళ్ల కోసం రైతులు పొలాలకు నీరు వేసి దమ్ము చేస్తున్నారు కొందరు రైతులు వారం రోజుల క్రితమే నారు చల్లి పెట్టుకున్నారు. మిగతా పొలానికి నీటిని పెట్టి దమ్ము చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వానకాలం పంటల సాగు సమయంలో డ్రం సీడ్ వెదజల్లే పద్ధతిలో మంచి ఫలితాలు రావడంతో యాసంగి ఈ సాగు వైపు అధికంగా రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో పొలాలను మొత్తంగా దున్ని వరి సాగు కోసం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సాగు పనులు బోరుబావుల కింద మొదలు కాగా.. మండలానికి ప్రధానంగా ఎస్సారెస్పీ ఆయకట్టు ద్వారా సాగునీరు అందనున్నాయి. ఈ ఆయకట్టుకు ప్రభుత్వం నీటిని విడుదల చేస్తే సాగు పనులు ముమ్మరం కానున్నాయి. అయితే ఇప్పటి వరకు ఆయకట్టు రైతులకు పంటల సాగు కోసం నీటిని విడుదల చేసేది లేనిది స్పష్టత లేకపోగా.. నూతన ప్రభుత్వం కొలువు దీరిన తర్వాతే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశముంది.

విత్తనాలు కొనుగోలు

వానాకాలం పంటల అమ్మకాలు చివరి దశకు రావడంతో రైతులు యాసంగి విత్తనాల కోసం దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ వారం రోజులుగా ఎన్నికల హడావుడి కారణంగా కొందరు నారుమళ్లను సిద్ధం చేయకపోగా కౌంటింగ్ కూడా పూర్తయ్యే అవకాశముండడంతో ఇక సాగు జోరుగా సాగనుంది. కొందరు రైతుల ధాన్యం అమ్మకాలు పూర్తి కాకపోవడంతో ఓ వైపు ధాన్యం వద్దకు.. మరోవైపు విత్తనాల కొనుగోలుకు, దుక్కులు దున్నేందుకు పరుగులు తీస్తున్నారు.


ఆత్మకూర్‌లో డ్రమ్‌సీడర్ విధానంలో సాగుకు సిద్ధం చేస్తున్న పొలం


ఆత్మకూర్‌లో ఓ రైతు పొలంలోని నారుమడి

కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయం

మునగాల : కోదాడలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎన్.పద్మావతికి భారీ మెజార్టీ రావడం ఖాయమని పలువురు పార్టీ మండల నాయకులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శనివారం వారు కోదాడలోని క్యాంపు కార్యాలయంలో పద్మావతిని కలిసి ముందస్తుగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో పద్మావతి గెలుపు కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు నల్లపాటి శ్రీనివాస్, ఎలక నరేందర్‌రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, కొప్పుల జైపాల్‌రెడ్డి, గరిణె శ్రీధర్ పాల్గొన్నారు.

పల్లె దవాఖానాకు భవనమేది ?

- జాజిరెడ్డిగూడెంలో పూర్తిగా శిథిలమై వినియోగంలో లేని పాతభవనం
- ప్రస్తుతం తాత్కాలిక భవనంలో పల్లె దవాఖాన ఏర్పాటు
- కొత్తగా భవనం నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ప్రజల వినతి


పూర్తిగా శిథిలమై వినియోగంలో లేని పాత దవాఖాన భవనం


తాత్కాలికంగా ఎస్సీహాస్టల్ భవనంలో ఏర్పాటు చేసిన పల్లె దవాఖాన

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని పల్లె దవాఖాన భవనం పూర్తిగా శిథిలమై కూలేదశకు చేరింది. దీంతో ఈ భవనాన్ని కొంత కాలంగా వినియోగించడం లేదు. అయితే పూర్తిగా శిథిలమైన ఈభవనం ఎప్పుడు కూలుతుందో అర్థంకాక కొంత కాలం గ్రామంలోని గోపాలమిత్ర భవనంలో తాత్కాలికంగా పల్లె దవాఖానను నడిపించారు. అయితే ఈభవనం పల్లె దవాఖానకు సరిపోక పోవడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బంది పడ్డారు. దీంతో మళ్లీ దవాఖానను తాత్కాలికంగా గ్రామంలో నిరుపయోగంగా ఉన్న ఎస్సీహాస్టల్ వసతి గృహం భవనంలోకి మార్చారు. దీంతో నిరుపయోగంగా ఉన్న భవనంలో కనీస వసతులు కొరవడి రోగులు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలమైన భవనాన్ని తొలగించి కొత్తగా పల్లె దవాఖానకు సొంత భవనం నిర్మించాలని గ్రామస్తులు, వైద్య సిబ్బంది కోరుతున్నారు.

అందరూ అందుబాటులో ఉన్నా..

ఈ గ్రామం మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ. ఈ గ్రామంలో సుమారు 5వేల జనాభా ఉంటుంది. ఇక్కడి పల్లె దవాఖానాకు డాక్టర్‌ను కూడా నియమించారు. అలాగే ఇద్దరు ఏఎన్‌ఎంలు, నలుగురు ఆశ కార్యకర్తలు ఉన్నారు. డాక్టర్, సిబ్బంది పోస్టులు అన్నీ ఉన్నా ...వైద్య సేవలందించడానికి భవనం లేక రోగులు, వైద్య సిబ్బంది నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీ అయిన ఈ గ్రామంలో పల్లె దవఖానాకు పక్కా భవనం నిర్మించాలని ప్రజలు సంబంధిత అధికారులకు ఎంతోకాలంగా మొరపెట్టుకుంటున్నారు. మండంలోని చిన్నచిన్న గ్రామాల్లో పల్లె దవాఖానలకు సొంత భవనాలు నిర్మిస్తుండగా తమ గ్రామంలో ఎందుకు నిర్మించడం లేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పల్లెదవాఖానాకు సొంతభవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తిచేస్తున్నారు.

సొంత భవనం నిర్మించాలి



5వేల జనాభా కలిగిన మా గ్రామంలో పల్లె దవాఖానకు ఇంతవరకు పక్కా భవనం లేదు. కొంతకాలంగా తాత్కాలిక గదులలో దవాఖానాను నడిపిస్తున్నారు. ఇప్పటికై నా శిథిలమైన భవనాన్ని తొలగించి కొత్త భవనం నిర్మించాలి.

– శిగ నసీర్‌గౌడ్, జాజిరెడ్డిగూడెం

డాక్టర్, సిబ్బంది ఉన్నా భవనం లేదు



జాజిరెడ్డిగూడెం గ్రామంలోని పల్లె దవాఖానకు డాక్టర్, సిబ్బంది అంతా ఉన్నా భవనం లేదు. దీంతో నిత్యం ప్రజలకు అందించే వైద్య సేవలకు ఇబ్బంది అవుతుంది. శిథిలమైన ఆరోగ్య కేంద్రం భవనాన్ని తొలగించి అదే స్థలంలో సొంత భవనం నిర్మించాలి. కొత్తగా నిర్మించే భవనంలో ఆపరేషన్ థియేటర్‌తోపాటు అన్ని వసతులు కల్పించాలి.

– దడిపల్లి వెంకట్, జాజిరెడ్డిగూడెం